[“జ్యోతి” మాసపత్రిక దీపావళి 1978]

మళ్ళీ కలుద్దాం!

“హలో, రఘునాథరావుగారూ! బావున్నారా?” అంటూ ఆప్యాయంగా పలకరించి, నేను ఆశ్చర్యంలోంచి తేరుకొనేలోగానే నా కుడిచెయ్యి అందుకొని నొక్కాడు.

నా మొహానికి పూసుకొన్న చిరునవ్వులో అతనికి—నేనతన్ని గుర్తుపట్టలేక పోయానని తెలిపే భావమేదో కనబడుతుంది.

“మీరు రఘునాథరావుగారు కాదా! మీది గుంటూరుజిల్లా పర్చూరు కదా?” అన్నాడతను జోరుగా “సార్—” అని చెయ్యొదిలేశాడు, అంతలోనే.

“ఔనౌను. నేను రఘునాథరావునే. నేను మిమ్మల్ని గుర్తుపట్టలేక పోయినాను.”

“నేను జగన్నాథాన్ని సార్. బాపట్ల తాలూకాఫీసులో మీ దగ్గర పని చేసేవాణ్ణి.”

“అబ్బో ఎప్పటిమాట!” పదహారేళ్ళ క్రితం.

“ఇప్పుడేం చేస్తున్నారు?” అన్నాను.

“వాల్తేర్లో ప్రొఫెసర్‌గా వున్నాను సర్-డిపార్టుమెంటు?”

“నేను మిమ్మల్ని గుర్తుపట్టలేక పోయినాను. క్షమించండి!”

“గుర్తు పట్టలేక పోవడంలో వింతేంలేదుగాని” నాకన్నా క్షమాభిక్షుకుడిగా మారాడతను—“మీరు నన్ను మీరూ అనడం; క్షమించండీ అనడం నాకేదో యిబ్బందిగా వుంది సార్. ఎంచక్కా ఏమోయ్ జగన్నాథం అనేవారు, ఆ ఆప్యాయత మరి రాదా సార్?”

అప్పుడైతే అనేవాణ్ణేమో.

అయితే అందులో అతనంటున్న ఆప్యాయతేం లేదు.

నేనూ అతని వయసువాణ్ణే. సరాసరి డిప్యూటీ తహసీల్దార్‌గా చేరినవాణ్ణి, అతను కొత్తగా కాలేజీమెట్లు దిగి ఎల్. డి. సీ.గా చేరినవాడు. ఆ అనుబంధంలో మీరూ! మీరూ అంటూ కూచుంటే పన్లు జరగవు....

“హైదరాబాదెడుతున్నారా సార్?”

అవును.

ఇంకో నాలుగురోజుల తరువాత గవర్నరు వాల్తేరు వస్తారు. వారి క్యాంపులో కొన్ని ముఖ్యమైన పరిశీలనలు జరుగుతాయి.అయితే ఏదో మామూలు విజిట్‌లాగా, సైట్ సీయింగ్ ప్రోగ్రాంలాగా కనబడాలని గవర్నర్‌గారి ఉద్దేశం. కాగితాలమీద అలాగే సూచించేరు.కాని అసలు పరిశీలన జరగవలసిన విషయాలు కలెక్టర్‌గారికీ, డి. ఐ. జి. గారికీ, కొంతమంది ముఖ్యులకు స్వయంగా చెప్ప వలసినవి వున్నాయి. నివేదించవలసిన కొన్ని రహస్య విషయాలున్నాయి. అందించవలసిన కొన్ని డాక్యుమెంట్లున్నాయి; ఆ కారణంచేత హోంమినిస్ట్రీ సెక్రటరీగారి అనుమతిని ప్రత్యేకంగా వచ్చాన్నేను.ఫస్టుక్లాస్‌కంపార్టుమెంట్‌లో "కుపే" వుంది నా పేరిట.

"ఔను. మీరో?"

"నేనూ హైదరాబాదేనండి. ఫస్టుక్లాస్ టికెట్ తీసుకున్నాను. ఏకామిడేషన్ లేదన్నారు. వి.సి.గారితో చెప్పించాను. ఈ కంపార్టుమెంట్‌లోనే ఇస్తానన్నారు. ఇంకా కన్‌ఫర్మ్ చెయ్యలేదు."

"ఐ.సీ!" అన్నాను, నా సహజ నిర్వికార ధోరణిలో.

ఒక రైల్వే అధికారి వచ్చి ఇంతకుముందే నాతో మాట్లాడాడు. ఈకుపేలో బెర్త్ అతనికివ్వడానికి నా అనుమతి అడిగాడు. ఇచ్చాను. "ప్రొఫెసర్ జగన్నాథం" అంటే యెవరో అనుకున్నాను. ఇత నేనన్నమాట.

"లోపలికి పోదాం పదండి!" అన్నాను.

నన్ను దిగబెట్టడానికొచ్చిన వాళ్ళంతా ఇతను పలకరించడానికి ముందే వెళ్ళిపోయారు. "ఇక్కడే హేంగ్ అవొద్దు. నాకు పబ్లిసిటీ నచ్చదు!" అని నిష్కర్షగా కసిరేసాను వాళ్ళని. నేనొచ్చిన పని పరమ రహస్యం. నా ఉనికిని, మూవ్‌మెంట్సును ఎవరో గమనించడం నాకిష్టం వుండదు.

* * *

జగన్నాథం—

"చురుకైన వాడే" అని ఆర్. డి. ఓ. ఆఫీసు హెడ్‌గుమస్తా చెప్పాడు.

మొదట అక్కడ అపాయింటయ్యాడు జగన్నాథం. అక్కడ చేరిన నాలుగు నెలలకి తాలూకాఫీసులో వేశారతన్ని.

ఎంత చురుకైనవాడో అతనొచ్చిన వారం రోజుల్లోగా తెలిసిపోయింది. తివిరి ఇసుమున "తైలంబు" తీసేసేవాడు.

అది నాకు నచ్చలేదు. ఇలాంటి వాళ్ళ ద్వారానే ప్రభుత్వఆఫీసులకు చెడ్డ పేరు వచ్చేది.

అతని పద్ధతంతా విలక్షణంగా వుండేది. ప్రాణం పోయినా కాగితం ఆలస్యం చేసేవాడుకాదు. అతనికి లాభించే కాగితం అయితే మరీనూ.

పార్టీలయితే వాళ్ళ యిళ్ళకే వెళ్ళిపోయేవాడు. తిమ్మిని బ్రహ్మిని, బ్రహ్మిని తిమ్మిని చేసి, తావుల కొద్దీ నోటుమైల్సు రాసేసేవాడు. అరడజను స్టాక్ ఫైల్సులో యిరవై ఫ్లాగులు పెట్టి ఫైలు పకడ్బందీగా తయారుచేసేసేవాడు. ఒకటికాదు! సీట్లోకొచ్చిన ప్రతికాగితానికీ అలాగే. ఎప్పుడు రాసేవాడో మరి.

పార్టీలు అడిగిన వరాలు యిచ్చితీరవలసిందేనని తేల్చేవాడు. ఎవరికీ చదివే ఓపిక లేక, వరుసగా చిన్న సంతకాలు పడిపోయి ఆర్డర్సుగా రూపొందేవి. అతని "నోట్లు" అతను లాభం పొందేవాడని తెలిసిపోతూనే వుండేది. కాని అతను డిల్డవ్ చేసిన ఫైల్లో?

నాకు తెలిసేది: తప్పుడు ఆర్డర్సు వేస్తున్నానని, వేయిస్తున్నావని అతనికి తప్పక లాభిస్తోందని. కాని ఏం చేస్తాను? పని తొందర. ఒకవేళ ఏదైనా కుంటి క్వెరీ వేసి రిటర్న్ చేసినా అస్త్రశస్త్రాలతో తయారై ప్రిసిడెంట్సు. జి. ఓలూ కోట్ చేసేసి క్వెరీ వేసిన అరగంటలో ఉక్కిరి బిక్కిరి చేసేసేవాడు.

ఒక ఫైల్లో—నేనేకాక పై అధికారులు కూడా ఇరుక్కున్నాం; తప్పుడు ఆర్డర్సు వేసేసి ఆర్డర్సుపడ్డ పదిరోజులకి గవర్నమెంట్ నించి గూటింపు వొచ్చేసింది—మీకెవరికయినా మతులున్నాయా అంటూనూ.

కలెక్టర్‌గారు నన్ను పిల్చి అడిగారు. ఒక రాత్రంతా కూర్చుని, ఫైలు, రూల్సు, మేన్యువల్సు, కోడ్సు, బి. పి. లు; క్షుణ్ణంగా చదివి—జగన్నాధం నోటు ఆధారంగా మేమంతా తప్పు చేసేమని తెలుసుకున్నాను. కాగితం మీద పెట్టకుండా చల్లగా కలెక్టర్‌గారి దగ్గిరికెళ్ళి విన్నవించుకున్నాను,

"అతన్నో కంట కనిపెట్టండి మరి?" అన్నారు కలెక్టరుగారు.

ఈ ఫైలు ఆధారంగా అతనిమీద చర్య తీసుకోవద్దని; సరికొత్త కేసు ఏదో చూసుకొని దాంట్లో అతని భరతం పట్టమని ఆయన వుద్దేశం. సుళువుగానే గ్రహించాను.

పాతికరోజులు తిరక్కుండా మరో కేసులో దొరికాడు జగన్నాధం.

ఇప్పట్లో అప్పుడు ఎ.సి.బి.లు అవీలేవు. ఛార్జి మెమో చాలు: ఉద్వాసన చెప్పడానికి. అందులోనూ—గట్టిగా ఏడాది సర్వీసులేని ఎల్.డి.సి!

జగన్నాథాన్ని డిస్మిస్ చేయించడానికి పెద్ద శ్రమ అక్కర్లేకపోయింది. అంతముక్కూ కూడా, గట్టిగా తుమ్మేసరికి వూడిపడిపోయింది.

*　　　*　　　*

"మంచికో చెడ్డకో జరిగింది సార్ అది. ఆ ఆరునెలల్లోనూ ఐదువేలకి పైగా సంపాదించుకున్నాను. అది పెట్టుబడిగా, యూనివర్శిటీలో ఎమ్.ఎ. చదివాను. రెండేళ్ళు. వెంటనే ఉద్యోగం వచ్చింది; ఓ కాలేజీలో లెక్చరర్‌గా. మళ్ళీ రెండేళ్ళు కష్టపడి రీసెర్చిచేసి డాక్టరేటు తెచ్చుకునేసరికి యూనివర్శిటీలోనే లెక్చరర్ వుద్యోగం దొరికింది. ఒక వి.సి.గారు నన్ను స్టేట్స్ పంపారు. ఇంకో వి.సి.గారు వెస్ట్ జర్మనీ పంపారు. ఐదేళ్ళలో అక్కడే రీడరయ్యాను; ఫారిన్ డిప్లొమా సహాయంతో.... పన్నెండేళ్ళలో ప్రొఫెసరే అయ్యాను. ఫారిన్ ఎక్స్ఛేంజ్‌తో వైజాగ్‌లో మంచిచోట ఇంటిస్థలం సంపాదించేను; ఇల్లూ కట్టేను. ఇద్దరు అబ్బాయిలు; ఒకమ్మాయి పుట్టారు. అందరూ ఇంగ్లీషు మీడియమ్‌లో చదువుకుంటున్నారు. ఒక ఫియట్ కారుంది. దేశం అంతటా అభిమానులున్నారు. ఇదంతా మీ చలవే సార్. అప్పుడు మీరె పట్టుబట్టి నన్ను డిస్మిస్ చేయించకుండా వొదిలేసి, వాడి పాపాన వాడే పోయాడులే అని వొదిలేస్తుంటే—ఈ ప్రగతి ఏదీ లేనేలేదు? ఎక్కడో తాలూకాఫీసులోనో, కలెక్టరాఫీసులోనో—యూడీసీగా—మహా ఐతే డిప్యూటీ తాసిల్దార్‌గా రాట్ అవుతూ వుండేవాణ్ననుకుంటాను!" అన్నాడు జగన్నాథం.

తుని స్టేషన్ కాబోలు, వస్తోంది.

నేను చాలా సిగ్గుపడ్డాను....

ఆనాడు నేను చేసింది రైటే.

అతను ముందుకు వెళ్ళిందీ రైటే.

కాని—ఒక మనిషిని—సంప్రదాయం, ప్రజల బలహీనతా ఆధారంగా; లంచాలు పుచ్చుకుంటున్నాడని "డిస్మిస్" చేయించడం తప్పేమోనని తొలిసారిగా అనిపించింది.

అతనిలో ఆ పట్టుదలా కార్యదీక్షా లేక పోయుంటే—?

గవర్నమెంట్‌లో పనికి రాలేదని ఏ చిల్లర వ్యాపారమో చేసేవాడేమో!

"పన్నుల నిర్ణయం—ప్రజల బాధ్యత." అనే విషయంమీద నాటి దిన పత్రికలో ప్రచురణ అయిన తన వ్యాసం ఒకటి చూపించాడు. అలవోకగా

చెప్పినట్టుగా వుంది. కాని సాధికారికంగా చెప్పాడు. ఆ నేర్పు చూసి ఆశ్చర్య పోయాను.

"మీ భోజనం మాటేమిటి సార్?"

నేనేం మాట్లాడలేదు; పేపర్లో మరో ఐటం ఏదో చూస్తున్న నెపంమీద.

"సామర్లకోట వచ్చేస్తోంది సార్. మీ భోజనం మాటేమిటో?" అన్నాడతను మళ్ళీ.

"నాకు రాజమండ్రిలో భోజనం ఒస్తుంది" అన్నాను. తప్పించుకోలేక.

"అలా అయితే నేనిక్కడ-అదే, సామర్లకోటలో—తినెయ్యనా, సార్?.. అంటే మరేం లేదనుకోండి—రామారావు వస్తానన్నాడు; సామర్లకోట స్టేషన్ దగ్గిర ఈ బండి ఆగేవేళకి—వాడొస్తే ఏదో ద్రవపదార్థం తెస్తాడు. రాజమండ్రిలో దిగిపోతాడు,"

నేను సీరియస్‌గా చూశాను.

"మీ కభ్యంతరమైతే వాణ్ని రైల్లోకి రానివ్వను సార్. పది నిమిషాల పాటు బండి ఇక్కడ ఆగుతుంది కనక ప్లాట్‌ఫారంమీదనే అవగొట్టేస్తాం."

"అతనెవరు?"

"రైల్వేలో పని."

"ఓ.కే. రమ్మనండి" అన్నాను.

ఆ మాట విని అతను కిటికీలోంచి తల బైటికి పెట్టాడు వీలయినంత వరకు. అప్పటికి ప్లాట్‌ఫారం సమీపిస్తోంది. రామారావు ఇతని కోసం తీక్షణంగా చూస్తున్నట్టున్నాడు. ఇతన్ని గమనించి, పరుగెత్తుకుంటూ వచ్చాడు. సరాసరి లోపలికొచ్చేసి: "గుడ్మార్నింగ్ సార్! నేను రామారావుని!....ఏరా వెధవా; పరిచయం చెయ్యవేంరా?" అన్నాడు; మా యిద్దరితోటీ.

మావాడు కొంచెం రఫ్‌గా మాట్లాడుతాడు సార్. మీకేమాత్రం యిబ్బందైనా చెప్పండి. దింపేస్తాను!" అన్నాడు జగన్నాథం. రామారావుకి జోక్‌గా, నాకు సిన్సియర్‌గా వినిపించే ధోరణి అంది పుచ్చుకొని.

"నా పెటాల్!" అని—చదువుతున్న పేపరు పూర్తిగా విప్పి; వాళ్ళేం చేస్తున్నారో చూడ్డం మానుకున్నాను.

ప్లాస్టిక్ బుట్టలో సీసాలు, గ్లాసులు. పొట్లాలు—

రాజమండ్రి వచ్చేలోగా అన్నీ ఖాళీ. మధ్యలో రెండుమూడుసార్లు నాకూ "[illegible]" చెయ్యడం—నేను వద్దని ఖచ్చితంగా చెప్పడం—

రాజమండ్రిలో నేను భోజనానికి దిగిపోయాను. నా భోజనం అయ్యాక, నేను కంపార్టుమెంటులో కొచ్చేక. బండి కదిలింది.

అప్పటికి రామారావు లేడు అక్కడ. జగన్నాధం పడుకుని వున్నాడు.

నేను "ఇపే" తలుపు తెరవగానే "గుడ్‌నైట్ సార్" అంటూ అటు తిరిగాడు.

*　　　*　　　*

విజయవాడలో మెలకువ వచ్చిందతనికి. నాకసలు నిద్దరే రాలేదు——

బాపట్ల తాలూకా ఆఫీసు....రొంపేరు ప్రాజెక్టు——పేదలకి పొలాలూ స్థలాలూ పంచిపెట్టడం——ఆ కుంభకోణం——జగన్నాధం నోట్‌ఫైల్స్——కలెక్టర్ గారి ఎన్క్వయిరీలు- ఇతని డిస్మిసల్——ఏవేవో జ్ఞాపకాలు; అన్నీ వివరాలతో సహా.

ఆ సందట్లో మరికొన్ని వ్యక్తిగత జీవితపు జ్ఞాపకాలు——

విజయవాడ దాటినా నిద్రరాదేమో అనిపించింది....

ప్రొఫెసర్ జగన్నాధం——

రామారావు-రాత్రి ఎనిమిదిన్నరకి గుడ్మార్నింగ్ అనగలిగిన రైల్వే వుద్యోగి——టిక్కెట్టు, పర్మిట్టూ ఏమీ లేకుండా సామర్లకోటనుంచి రాజమండ్రి వరకు ఫస్టుక్లాసులో ప్రయాణం——

మందూ, మాంసం——

అసహ్యం వేసింది.... జుగుప్స కలిగించి.

బాత్‌రూంలో వున్నాడుగాని——

ఆ క్షణం అతను ఎదురుగా వుంటే చాచి లెంపకాయ కొట్టాలని అనిపించేదే——

ఆ బెర్తువేపు చూడ్డానికే అసహ్యంగా వుంది.

కోటూ బూటూ బాత్రూం శాండల్సూ——అట్టహాసంగానే వున్నాడు. రేపు హైదరాబాద్‌లో ఏదో సెమినార్‌ట; "పేపరు" చదువుతాట్ట!

బాగానే ప్రిపేరయి వచ్చినట్లున్నాడు.

అతని వైదుష్యంచూసి ఆనందించాలా, కృషిచూసి మెచ్చుకోవాలా, చిలిపితనం చూసి చిరాకుపడాలా తేల్చుకోలేక పోతున్నాను-అతను కూర్చున్న భాగం వేపు చూశా నొకసారి, అప్రయత్నంగా; తీక్షణంగా.

అక్కడ వేలాడదీసిన కోటు పాకెట్లోంచి ఏదో విజిటింగ్ కార్డు లాంటిది తొంగి చూస్తోంది.

ఆ క్షణం—

వీడు చెప్పేవన్నీ నిజమేనా—అసలు వీడు ప్రొఫెసరు జగన్నాధమేనా—అని నా ప్రవృత్తి సహజమైన అనుమానం తలెత్తి చూసింది. మరుక్షణం లేచి. స్లైటార్పి ఆ కార్డు తీశాను. అతను లేవటరీలోంచి వచ్చి తన పక్కమీద పడు కొన్నాడు.

నేను ఒక మూలుగు మూల్గి, లేచి వచ్చి; బండి దిగి—లైటు దగ్గిర చదువుకున్నాను. ఆ విజిటింగ్ కార్డుని.

అంతే.

నా అడుగులు రైల్వే పోలీసు ఆఫీసువేపు పడ్డాయి.

"ఎవరు కావాలి సర్?" డ్యూటీలోవున్న రక్షక్ అడిగాడు.

నా ఫొటో పాస్ చూపించాను.

శెల్యూట్ చేశాడు. "దై చేండి, సార్!"

జగన్నాధం జేబులో దొరికిన విజిటింగ్ కార్డు నా చేతుల్లోవుంది. తిన్నగా ఫోన్‌దగ్గిర కెళ్ళాను. కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేసి—"అర్జంటుగా హైదరాబాద్‌కి మెసేజ్ యివ్వండి?" అంటూ వివరాలు చెప్పాను.

"తమరెవరు సార్?" అడిగింది అట్నుంచి గొంతు.

"బాస్టర్డు! ఎవరో చెప్తే ఇంతకథా వింటావన్న మాట!" అని అరిచాను.

"ఎక్స్‌క్యూజ్‌మి సార్. ఇదుగో డియస్పి గారొచ్చారుసార్. వారితో మాట్లాడండిసార్" అని వణికిండా కంఠం.

"ఇమ్మను"

"హలో—"

"నేను రఘునాథరావుని; స్పెషల్ సెక్రెటరీ—హోం! అక్కడ డ్యూటీలో వున్న కాన్‌స్టేబుల్‌కి వివరాలు చెప్పాను. మెసేజ్ తక్షణం హైదరాబాదుకి చేరవెయ్యండి!" అని ఫోన్ పెట్టేశాను.

* * *

"అర్హతలుగాని, అనుభవంగాని (రెండూగాని) వున్న అభ్యర్థులకు చక్కని సువర్ణావకాశం? మీరు ఇరాక్, ఇరాన్, దుబాయ్—లలో ఎక్కడికైనా ఉద్యోగరీత్యా వెళ్ళాలని అనుకొంటున్నారా? నెలకు ఐదువేలు అంతకు మించిన జీతం సంపాదించుకోవాలని కోరుకుంటున్నారా? అయితే వెంటనే; పాస్‌పోర్టు మొదలైన డాక్యుమెంట్ల సేకరణలో ఖర్చుల నిమిత్తం నూరు రూపాయలతో దరఖాస్తు చెయ్యండి—ప్రొఫెసరు లోకనాథం—సువర్ణా ఏజన్సీస్—31-12-31; మహారాణీపేట; విశాఖపట్నం" అని—ఆరు నెలల క్రిందట పేపర్లో ప్రకటన పడ్డాది.

మా రెండో అబ్బాయి, ఎల్. ఎం. ఇ. పాసై, అన్నిటికీ పెట్టినట్టే దీనికీ పెట్టారు. "దరఖాస్తు." నూరు రూపాయలూ కట్టాడు. వాడి స్నేహితులు ఒకరిద్దరితో కట్టించాడు కూడాను.

కొన్నాళ్ళయ్యాక ఉత్తరం రాశాడు. మా సంగతి ఏమయిందంటూనూ.

జవాబు లేదు—

మళ్ళీ రాసేడు—

ఊఁ హూఁ.

నాలుగునెలల కిందట అశోకన్ విశాఖపట్నానికి బదిలీ అయినప్పుడు "ఇదేదో మా అబ్బాయి ప్రయవేటు కంప్లెయింట్....కొంచెం చూడు—" అని ఫోన్లో చెప్పాను.

అతను వైజాగ్‌లో జాయినైన వారం రోజుల్లో వొచ్చింది వుత్తరం: "అదేదో బోగస్ కంపెనీ సార్. మహారాణీపేట అంతా తిరిగినా ఆ హౌస్ నంబరే లేదు. ఆ నెంబరింగే తప్పు. అయితే పెద్ద పెద్ద అంకెలతో అదే నంబ

రును వేసి, సువర్ణా ఏజెన్సీస్ అనే బోర్డు పెట్టిన ఇల్లు కనుక్కున్నాను. ఇప్పుడు ఆ బోర్డూలేదు, ఆ కంపెనీలేదు. వాళ్ళకి—బ్యాంక్‌లో ఆపేరిట అకౌంట్ వుండేదిట. బ్యాంక్‌లో వెరిఫై చేశాను. కరెంట్ అకౌంట్. ప్రొఫెసరు లోకనాథం మేనేజింగ్ డైరెక్టరుగా ఆపరేట్ చేశాడు. ముప్ఫయ్యెనిమిది వేలు డిపాజిట్ చేర్చింది. అంతా విత్‌డ్రా చేసి అకౌంట్ క్లోజ్ చేశారు."

*   *   *

సికింద్రాబాదు వచ్చేవరకు అలా మేలుకొని కూర్చున్నాను. ఎందుకంటే:

విజయవాడలో నేను ఫోన్ చేసి రాగానే—

"నా కోటు జేబులో ఒక విజిటింగ్ కార్డుండాలి, ఇక్కడెక్కడైనా పడిపోయిందా?" అంటూ అడిగాడు, వెతికాడు, జగన్నాథం.

సికింద్రాబాదులో నేను దిగిపోవాలి.

సికింద్రాబాదు స్టేషన్ దాటితే చాలు. హైదరాబాదు స్టేషన్లో అతనికోసం మా వాళ్ళు వచ్చేస్తారు. మెసేజ్‌లో కంపార్టుమెంటు నెంబరు ఇచ్చాను.

బండి కదలబోతూవుండగా అతన్ని పలకరించాను "జగన్నాథం!"

మూలిగాడు. కదల్లేదు.

"మిస్టర్ లోకనాథం!" గర్జించాను.

"ఎస్‌సార్" అంటూ లేచాడు. "మీరు దిగిపోతున్నారా?....చాలా కాలం తరువాత కలిశాము. ఎంతో సంతోషంగా వుంది.... మళ్ళీ కలుద్దాం!" అని చెయ్యి జాపాడు,

"అవును. ఈ మాటు కొంచెం త్వరలోనే కలుద్దాం!" అన్నాను, నా బ్రీఫ్‌కేస్‌తో దిగిపోతూ. **